కు.ని.తో కుక్కల సమస్యకు చెక్
మెదక్‌లో అందుబాటులోకి వచ్చిన ఏబీసీ
మూడు నెలలుగా వెయ్యికి పైగా ఆపరేషన్లు
ఒక ఆపరేషన్‌కు రూ.1650 చెల్లిస్తున్న బల్దియా
శునకాల పెరుగుదలకు అడ్డుకట్ట 7

నిప్పుల కొలిమి

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు తీవ్రం

ఏడు ప్రాంతాల్లో 43 డిగ్రీల కంటే అధికం..
49 ప్రాంతాల్లో 42 డిగ్రీల కంటే ఎక్కువ..
112 ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు



ఉమ్మడి మెదక్ జిల్లాలో భానుడి ప్రతాపం కొనసాగుతున్నది. మూడు రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం ఉమ్మడి జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో 43 డిగ్రీల కంటే ఎక్కువ, 49 ప్రాంతాల్లో 42 డిగ్రీల కంటే ఎక్కువ, 112 ప్రాంతాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లా తొగుట మండలం రాంపూర్‌లో 43.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, మెదక్ జిల్లా కొల్చారంలో 43, సంగారెడ్డి జిల్లాలో సిర్గాపూర్ మండలంలోని కడ్పల్‌లో 42.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కోహీర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి. మూడు రోజులుగా సూర్యుడు అగ్నిజ్వాలలు కురిపిస్తున్నాడు. ఉదయం 9 గంటలకే సుర్రుమంటున్నది. సాయంత్రం ఐదు గంటల తర్వాతే వాతావరణం కాస్త చల్లబడుతుంది. ఎండలకు భయపడి ప్రజలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేకపోతున్నారు. ఫ్యాన్లు, కూలర్లు వేసుకున్నా ఎండల తాపం తగ్గడం లేదు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రత వివరాలు..

సిద్దిపేట జిల్లా రాంపూర్ 43.3, చిట్యాల 43.3, సముద్రాల 43.3, పెద్దకోడూరు 43.3, తుక్కాపూర్ 43.1, రాఘవపూర్ 43.1, బెజ్జంకి 42.9, నారాయణరావుపేట 42.9 రేబర్తి 42.9, అబ్బీపూర్ 42.9, శనిగారం 42.7, సిద్దిపేట 42.6, కోహెడ 42.6, పోతిరెడ్డిపేట 42.6, కొమురవెల్లి 42.5, గౌరారం 42.5 దౌల్తాబాద్ 42.4, కట్కూర్ 42.3, వెంకట్రావుపేట 42.3, ముస్త్యాల 42.2, మిరుదొడ్డి 42.1 గజ్వేల్ 42.0, చికోడు 41.9 బేగంపేట 41.9 గండిపల్లి 41.8, బెజుగావ్ 41.8 తిప్పారం 41.7, హుస్నాబాద్ 41.5,దుర్శిట్ట 41.3, నంగనూరు 41.3, కొండపాక 41.3, లకుడారం 40.9, ములుగు 40.8 డిగ్రీలుగా నమోదయ్యాయి.

మెదక్ జిల్లా కొల్చారం 43, శంకరంపేట(ఆర్) 42.9, చిట్కుల్ 42.6, పొద్చన్‌పల్లి 42.6, కొత్తపేట 42.6

మిగతా 8వ పేజీలో

ఘనంగా జగ్గారెడ్డి కూతురు

నిశ్చితార్థ వేడుక


జయారెడ్డి, గుణచైతన్యరెడ్డిలను ఆశీర్వదిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


జగ్గారెడ్డితో కలిసి అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి రామ్‌నగర్ బస్తీలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల దంపతుల కూతురు జయారెడ్డి, గుణచైతన్యరెడ్డిల వివాహ నిశ్చితార్థ వేడుక అట్టహాసంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాహుల్‌గాంధీ పీఎస్ బైజు, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ సురేశ్‌శెట్కార్, సీనియర్ కాంగ్రెస్ నేతలు వీహెచ్, కుసుమకుమార్, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, జయవీర్‌రెడ్డి తదితరులు హాజరై కాబోయే దంపతులను ఆశీర్వదించారు.


సంగారెడ్డి రామ్‌మందిర్‌లో పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


మంత్రి కొండా సురేఖ ఆశీర్వాదం


నిశ్చితార్థ వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథ్, అంజన్‌కుమార్‌యాదవ్, కుసుమకుమార్

కశ్మీర్‌లో ఉగ్రదాడి..

మెదక్‌లో కలకలం

విహారయాత్రకు వెళ్లిన జిల్లావాసులు
పహల్గాంలో కాల్పులతో హోటల్‌లోనే బిక్కుబిక్కుమంటూ..
తిరిగి రప్పించాలని వీడియోలు.. మాజీ ఎమ్మెల్యే హన్మంతరావుకు వినతి
అక్కడి డీజీపీతో మాట్లాడిన మైనంపల్లి


జమ్మూకశ్మీర్ పోలీసులతో మెదక్ జిల్లావాసులు

మెదక్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు జరిపిన కాల్పులు మెదక్‌లో కలకలం సృష్టించాయి. ఉగ్రదాడిలో 28 మంది దుర్మరణం చెందడం.. 20 మంది వరకు గాయపడటంతో అక్కడికి విహారయాత్రకు వెళ్లిన మెదక్ వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ వార్త తెలిసిన వెంటనే ఇక్కడ ఉన్నవారి బంధువులు తమవాళ్లు ఎలా ఉన్నారో ఆందోళన చెందుతున్నారు. క్షేమంగానే ఉన్నామని చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే, తమను త్వరగా రప్పించాలని అక్కడివారు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును ఆశ్రయించారు.

ప్రముఖ చిట్‌ఫండ్ సంస్థ యాజమాన్యం తమ ఏజంట్లు, స్టాఫ్‌ను సమ్మర్ ట్రిప్‌కు కశ్మీర్ టూర్‌కు పంపించింది. రాష్ట్రానికి చెందిన పలు జిల్లాలతోపాటు మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన ఏజెంట్లు, ఉద్యోగులు కుటుంబ సభ్యులతో ఈ నెల 22న ఉదయం 8 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఇండిగో విమానం ద్వారా శ్రీనగర్‌కు బయలుదేరారు. పది గంటలకు అక్కడికి చేరుకున్నారు. నమ్రూస్ హోటల్‌లో వీరికి బస ఏర్పాటు చేశారు. షెడ్యూల్ ప్రకారం శ్రీనగర్‌లోని తులిప్‌గార్డెన్స్, కశ్మీర్‌లోని గుల్‌మార్గ్, పహల్‌గావ్, దాల్‌లేక్‌ను సందర్శించాల్సి ఉన్నది. మంగళవారం మధ్యాహ్నం శ్రీనగర్‌లోని తులిప్ గార్డెన్స్‌ను సందర్శించారు. అనంతరం హోటల్‌కు చేరుకుని విశ్రాంతి తీసుకుంటుండగా కాల్పుల వార్త తెలిసింది.

కాల్పులతో వణుకు

కశ్మీర్ సందర్శనకు బయలుదేరినవారిలో మెదక్ పట్టణానికి చెందిన ఓ పత్రికా విలేకరి పొగాకు రామకృష్ణ, ఆయన సతీమణి మహేశ్వరి, కుమారుడు సుశాంత్, చిట్‌ఫండ్ కంపెనీ మెదక్ బ్రాంచ్ మేనేజర్ పవన్, ఆయన సతీమణి చైతన్య, సంగారెడ్డి జిల్లాకు చెందిన మరో ఇద్దరు ఉన్నారు. వారు అక్కడి పరిస్థితిని వివరించారు. మంగళవారం మధ్యాహ్నం వరకు అంతా ప్రశాంతంగానే ఉందని, ఆ తరువాత పహల్‌గావ్‌లో తీవ్రవాదుల కాల్పుల వార్త తెలిసిందని చెప్పారు. ప్రస్తుతం రాజకీయ పార్టీల ఆందోళనలు, కర్ఫ్యూతో అట్టుడుకుతున్నదని, ఏం జరుగుతుందో తెలియక భయాందోళనకు గురవుతున్నామని వివరించారు. పర్యటనను రద్దు చేసుకుని స్వరాష్ట్రానికి వచ్చేస్తున్నామని వీడియో తెలిసిన వారందరికి పోస్ట్ చేశారు.

ధైర్యం చెప్పిన మైనంపల్లి

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, యూత్ కాంగ్రెస్ నేత, మాజీ కౌన్సిలర్ అరుణార్తి వెంకటరమణకు కశ్మీర్ పర్యటనకు బయలుదేరిన రామకృష్ణ వీడియో పంపగా వారు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంత్‌రావు దృష్టికితెచ్చారు. ఆయన వెంటనే స్పందించి జమ్మూ రాష్ట్ర డీజీపీ నళినీప్రభాత్‌తో మాట్లాడి సందర్శకులను రాష్ట్రానికి రప్పిస్తానని ధైర్యం చెప్పారు. అంతవరకూ హోటల్ గదుల్లోనే ఉండాలని సూచించారు.

జమ్మూకు డీఎస్పీ స్థాయి అధికారి



ఉగ్రదాడి పర్యవసానంగా జమ్మూకశ్మీర్ ఆందోళనలతో అట్టుడుకుతోంది. రాష్ట్రానికి చెందిన 80 మంది పర్యాటకులు శ్రీనగర్‌లో తాము బసచేసిన హోటల్‌లో బిక్కుబిక్కుమంటున్నారు. తెలంగాణ టూరిస్టులను క్షేమంగా రప్పించడానికి రాష్ట్రం నుంచి డీఎస్పీస్థాయి అధికారి వెళ్లారు. ప్రస్తుతం జమ్మూ డీజీపీగా విధులు నిర్వర్తిస్తున్న నళినీ ప్రభాత్ గతంలో కరీంనగర్ ఎస్పీగా పనిచేశారు. ఆయనతో చర్చించి తెలంగాణ టూరిస్టులను వీలైనంత త్వరలో రాష్ట్రానికి రప్పించేందుకు కృషి చేస్తున్నా.

-మైనంపల్లి హన్మంత్‌రావు


సంగారెడ్డి బస్టాండ్‌లో రద్దీ

బడులకు బై బై

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బడులకు వేసవి సెలవులు ఇచ్చారు. జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. విద్యాసంవత్సరం చివరి రోజు కావడంతో బుధవారం పాఠశాలల్లో సందడి నెలకొన్నది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రోగ్రెస్‌కార్డులను ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు. అనంతరం బడి గంట కొట్టగానే విద్యార్థులు సంతోషంతో కేరింతలు కొట్టారు. స్నేహితులకు వీడ్కోలు పలికి ఉత్సాహంగా ఇళ్లకు వెళ్లారు. హాస్టళ్లలో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి సొంతూళ్లకు ప్రయాణమయ్యారు.





సెల్‌వల్లో పడొద్దు
నేటి నుంచి స్కూళ్లకు హాలీడేస్..
పిల్లలకు జాలీడేస్ 7
తగిన జాగ్రత్తలు అవసరం..
సద్వినియోగం చేసుకునేలా చూడాలి

శివుడి విగ్రహాన్ని
కోతులే పడేశాయి
- జిన్నారం ఘటనలో 10 మందిపై కేసులు
- మత విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు
- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

నిర్బంధంలో జిన్నారం
- మరో వారం రోజులు సెక్షన్ 163 అమలు
- స్థానికేతరులకు గ్రామంలోకి నో ఎంట్రీ

7

ఉగ్రదాడిపై నిరసన

కశ్మీర్‌లోని పహల్గామ్ జిల్లా బైసరన్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిపై మెదక్, సంగారెడ్డి జిలాల్లో నిరసన వెల్లువెత్తింది. బుధవారం పలుచోట్ల ఆందోళనలు, దిష్టిబొమ్మల దహనాలు చేశారు. దాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపంగా సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. మెదక్‌లో చేపట్టిన కొవ్వొత్తుల ప్రదర్శనలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



భూభారతి చట్టం..
రైతులకు చుట్టం
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- పలు మండలాల్లో 'భూభారతి'పై అవగాహనా సదస్సు

8

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

6

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

శివ్వంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన సంఘటన బుధవారం శివ్వంపేటలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని శివ్వంపేటకు చెందిన ముద్దగాళ్ల లక్ష్మయ్యకు చెందిన పాడి గేదె పొలం దగ్గర గడ్డిమేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతిచెందింది. గేదె విలువ రూ.50 వేల విలువ ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు లక్ష్మయ్య కోరాడు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి


కమ్మరి మంజుల (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనంతో ఢీకొని మహిళ మృతి చెందింది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామానికి చెందిన కమ్మరి మంజుల(45) తన కూతురు అత్తగారు స్వగ్రామం కామారెడ్డి జిల్లా రామారెడ్డికి స్కూటీపై వెళ్లింది. బుధవారం ఉదయం 8 గంటలకు తిరిగి స్వగ్రామానికి వస్తుంది. చేగుంట గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారి సబ్ స్టేషన్ వద్ద ఎలాంటి ఇండికేషన్ ఇవ్వకుండా డ్రైవర్ లారీ నిలపడంతో ఆమె సడన్ బ్రేక్ వేసింది. దీంతో స్కూటీ అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో మంజుల తలకు, కుడి కాలుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కూతురు శృతిలయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

బైక్ అదుపు తప్పి.. డివైడర్ ఢీకొని..


సంతోష్ మృతదేహం

చేగుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన నార్సింగి మండల పరిధిలోని జప్తిశివనూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి రాత్రి చోటు చేసుకుంది. నార్సింగ్ ఎస్ఐ అహ్మద్ మొయినుద్దీన్ వివరాలు ప్రకారం.. సిద్దిపేట జిల్లా భూంపల్లి-అక్బర్‌పేట మండలం చౌదర్‌పల్లికి చెందిన వల్లెపు సంతోష్(28) పెద్దమ్మ కొడుకు పెనుగొండ రాజు కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ గండిమైసమ్మ నుంచి మంగళవారం రాత్రి కామారెడ్డి ఆస్పత్రికి బయలుదేరుతున్నారు. జప్తిశివనూర్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సంతోష్ తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని రామాయంపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి మెడిసిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య శ్రీలత, ఆద్య(3) ఉన్నది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు..

హవేళిఘణపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న టిప్పర్‌ను ఆటో ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన పోతగల్ల రాములు తన ఆటోలో ప్రయాణికులతో మెదక్ నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. శాలిపేట శివారులో ఐరన్ లోడ్‌తో టిప్పర్ ఆగి ఉన్నది. దగ్గరికి వచ్చేవరకు ఐరన్ కనిపించకపోవడంతో రాములు దగ్గరికి వచ్చాక బ్రేక్ వేసినా.. కంట్రోల్ కాక టిప్పర్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో శాలిపేటకు చెందిన లక్ష్మి(56) అక్కడికక్కడే మృతిచెందింది. రాములుతో పాటు పెంటి, శ్రీకాంత్‌కు తీవ్ర, బిందు, మల్లికార్జున్, రాములు, పల్లవి, సత్తవ్వకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐని వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


స్వప్న(ఫైల్

నారాయణఖేడ్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన సంఘటన నారాయణఖేడ్ మండల పరిధిలోని హన్మ్రాన.జీలో చోటు చేసుకుంది. ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రావుల స్వప్న(30) బుధవారం సాయంత్రం ఇంట్లో దుస్తులు ఉతికి ఇంటి ఆవరణలో పాత టీవీ కేబుల్ తీగపై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. కుటుంబీకులు వెంటనే నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలకు తీసుకు రాగా.. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త రావుల హన్మారెడ్డి, కుమారుడు సాయిచరణ్‌రెడ్డి, కూతురు భార్గవి ఉన్నారన్నారు. స్వప్న మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ సంగన్న వివరాల ప్రకారం కొడుపాక గ్రామానికి చెందిన అవుసుల శ్రీకాంత్(24) స్వర్ణకారుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 21న రాత్రి ఇంట్లో భార్య, తల్లికి మధ్య సంసార విషయంలో చిన్నపాటి గొడవ చోటు చేసుకుంది. ఇద్దరిని ఏమి అనలేక మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఒంటింట్లోకి వెళ్లి అక్కడున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వీధికుక్కల దాడిలో పలువురికి గాయాలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో వీధి పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోజూ ఏదో ఒక వార్డులో పిచ్చికుక్కల దాడిలో పలువురు గాయాలపాలవుతూనే ఉన్నారు. తాజాగా పట్టణంలోని శివాజి నగర్(4వ వార్డు)లో వీధి కుక్కల దాడిలో పలువురి చేతి, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వీరు స్థానిక జీజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. కాగా సంగారెడ్డిలో వీధి కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు కోళ్లఫాంకు నిప్పు

నంగునూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు పౌల్ట్రీఫామ్ సమీపంలో నిప్పంటుకుని మంటలు చెలరేగడంతో, సకాలంలో మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. నంగునూరు ఎఫ్‌సీఐ గోదాం వెనక పౌల్ట్రీఫామ్‌ను పల్లపు రాజు, కోల ప్రభాకర్‌గౌడ్ లీజ్‌కు తీసుకొని నిర్వహిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఫామ్‌కు సమీపంలో నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న ప్రభాకర్ కోళ్లకు చల్లదనం కోసం రేకుల షెడ్డుపైన ఉన్న డ్రిప్పు పైపులు విప్పి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించాడు. సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలు ఆర్పారు. ఫాంలో ప్రస్తుతం ఆరువేల కోడిపిల్లలు ఉన్నాయి. మంటల వేడికి అవన్నీ ఒక మూలకు చేరాయి.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి కాపర్‌వైర్ చోరీ

రాయపోల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లను దొంగిలించిన సంఘటన రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నీరుడి మల్లమ్మ పొలం సమీపంలో మల్కాపూర్ రోడ్డుపై గల రైల్వే బ్రిడ్జి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పగులగొట్టారు. అనంతరం అందులో ఉన్న ఇత్తడి, రాగి వైర్లు, కాయిల్స్ దొంగిలించారు. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఖననం చేసిన మృతదేహం కుటుంబీకులకు అప్పగింత

హుస్నాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వారంరోజుల క్రితం మండలంలోని జిల్లెలగడ్డ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యం పోలీసులు గుర్తుతెలియని శవంగా కేసు నమోదు చేసుకొని పట్టణంలోని శ్మశానవాటికలో ఖననం చేసిన సంగతి తెలిసిందే. మృతుడు ములుగు జిల్లా వెంకటాపురానికి చెందిన చిడెం సాయిప్రకాశ్ అని పోలీసులు గుర్తించారు. హనుమకొండ జిల్లా చింతగట్టుకు చెందిన బాషబోయిన శ్రీనివాస్ అనే కానిస్టేబుల్ కొంతమందితో కలిసి హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి వద్ద సాయిప్రకాశ్ గొంతుకు ఉరివేసి చంపినట్టు పోలీసులు గుర్తించారు. అనంతరం హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహాన్ని పడవేశాడు. మంగళవారం హత్య వివరాలను వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. దీంతో బుధవారం అధికారుల సమక్షంలో హుస్నాబాద్‌లో ఖననం చేసిన మృతదేహాన్ని బయటకు తీసి మృతుడి కుటుంబీకులకు అప్పగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేశ్, హన్మకొండ పోలీసులు పాల్గొన్నారు.

సెల్‌వల్లో పడొద్దు

నేటి నుంచి స్కూళ్లకు సెలవులు.. పిల్లలకు జాలీడేస్
తగిన జాగ్రత్తలు అవసరం.. సద్వినియోగం చేసుకునేలా చూడాలి

ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీపట్టిన చిన్నారులు ఇక చిచ్చరపిడుగులై చెలరేగిపోతారు. సెలవులు వచ్చాయంటే చాలు రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎక్కడంటే అక్కడే వాలిపోతుంటారు. ఇన్నాళ్లు యూనిఫాంలో బందీలైన వారు ఇప్పుడు మామూలు దుస్తుల్లో మరో లోకంలో తేలియాడుతుంటారు. సెల్‌ఫోన్, టీవీలు చూడడానికి గోల పెడుతుంటారు. మట్టి, మడుగు, చెట్టుచేమల్లో ఆడుతూ, చెరువుల వద్దకు వెళుతూ, ద్విచక్రవాహనాలను నడపాలని తహతహలాడుతూ హంగామా సృష్టిస్తుంటారు. సెలవుల్లో తల్లిదండ్రులు పిల్లలను ఒకకంట కనిపెడుతూ ప్రణాళిక ప్రకారం సద్వినియోగమయ్యేలా చూడాలి..


పాఠశాలకు సెలవులు ప్రకటించిన తర్వాత విద్యార్థుల ఉత్సాహం

సిద్దిపేట కల్చరల్/మెదక్ కల్చరల్/కొండపాక, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు వచ్చేశాయి. మళ్లీ జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయితే సెలవులను సరిగ్గా సద్వినియోగం చేసుకోవటం ఎలా..? పిల్లలు మొబైల్ చూడకుండా చేయడం ఎలా? ఎండల నుంచి పిల్లలను కాపాడుకునేదెలా? అంటే తల్లిదండ్రులకు పెద్ద పనే. అయితే, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పిల్లలకు విజ్ఞానం, తల్లిదండ్రులకు ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

సెల్‌ఫోన్‌కు దూరంగా..

స్కూల్ నుంచి వచ్చాక కొంచెం గ్యాప్ దొరికితేనే సెల్‌ఫోన్‌లో తలలు పెట్టేస్తారు పిల్లలు. అలాంటిది సెలవులు అంటే వారిని కట్టడి చేయటం కొంచెం కష్టమే. ఇవ్వకపోతే మారం చేస్తారు. దీంతో తప్పక తల్లిదండ్రులు మొబైల్స్ ఇచ్చేస్తుంటారు. ఇదే అసలు ప్రమాదకరం. పిల్లలను వీలైనంతగా సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉంచడం మంచిది. పిల్లలకు పుస్తకాలు చదవటం అలవాటు చేయటం, తల్లిదండ్రులు కూడా ఫోన్ వాడకాన్ని తగ్గించి వారితో గడపడానికి, మాట్లాడటానికి సమయమివ్వాలి. పిల్లలకు కథలను చెప్పే ప్రయత్నం చేయాలి. పెయింటింగ్, డాన్స్, సంగీతం వంటి ఇష్టమైన వాటిల్లో శిక్షణ ఇప్పించాలి. సాయంత్రం పూట స్విమ్మింగ్, లేదా బయటకు తీసుకెళ్లి వారితో సరదాగా గడపాలి. దగ్గరి బంధువుల ఇంటికి



పిల్లలను తీసుకెళ్లాలి సరదాగా గడపాలి. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు ఉంటే వారితో ఎక్కువ సమయం గడపాలి. అలాగే గ్రామంలో ఉన్న పెద్దవారితో, వృద్ధులతో కలుపుగోలుగా మాట్లాడుతూ వారు చెప్పే మంచి విషయాలు, కథలు, వారి జీవిత అనుభవాలు పిల్లలు శ్రద్ధగా వినాలి. గ్రామ చరిత్ర, పూర్వీకుల గురించి అడిగి తెలుసుకోవాలి. ఇలా చేయటం వలన పిల్లలతో బాండింగ్ ఏర్పడటంతో పాటు సెల్‌ఫోన్, టీవి చూడకుండా ఉండేలా చేయొచ్చు.

ఎండల తీవ్రత తట్టుకునేలా

వేసవి సెలవులు రావడంతో కొంతమంది పిల్లలు అమ్మమ్మ, నానమ్మ వాళ్ల ఇంటికి వెళతారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు ఇంటికి చేరుకుంటారు. వాతావరణం వేడిగా ఉండడంతో పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమటతో శరీరంలోని నీరు ఆవిరైపోవడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో పిల్లలు ఇంట్లోనే ఉండేలా చూసుకోవాలి. పెద్దల తోడు లేకుండా పిల్లలను బావులు, చెరువుల వద్దకు ఈత కోసం పంపించవద్దు. బైక్ నడపడానికి ఇవ్వవద్దు. స్నేహితులతో కలిసి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు అనుమతులు ఇవ్వొద్దు. బయట ఆడుకోవడానికి ఉదయం, సాయంత్రం వేళల్లోనే అనుమతించాలి. రెండు పూటలా స్నానం చేయించి, తెల్లని లేతరంగు దుస్తులు వేయాలి.

ఆహార జాగ్రత్తలు

పిల్లలు ఎక్కువగా చిరుతిండ్లను ఇష్టపడతారు. చల్లని పానీయాలు తాగేందుకు అల్లరి చేస్తారు. కూల్‌డ్రింక్‌లు, ఐస్‌క్రీంలు ఎక్కువగా తినిపించడం అంతమంచిది కాదు. ఉదయం ఎండ ఎక్కువ కాకముందే అల్పాహారం అందించాలి. బేకరీ, బయటి పదార్థాలు కాకుండా ఇంట్లోనే అల్పాహారం చేసి అందించాలి. తృణధాన్యాల జావ, మజ్జిగ, పాలను తాగించాలి. నిమ్మరసం, ఖర్జూరాలు ఇస్తే జీర్ణశక్తి పెరుగుతుంది. మధ్యాహ్న భోజనంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారం అందించాలి. ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తగ్గించాలి. ఆకుకూరలు తినిపించాలి. పుచ్చకాయ, దోసకాయ, మజ్జిగ, కొబ్బరి నీరు అందించాలి.


ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

సమ్మర్ క్యాంపులు

అభ్యాసనా అంశాలు మరచిపోకుండా జిల్లా విద్యా శాఖ ప్రణాళికలు రూపొందించి నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తుంది. వేసవి సెలవుల్లో సుమారు 10 రోజులపాటు ప్రతి మండలంలో మూడు నుంచి ఐదు ఎంపిక చేసిన పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తుంది. ఈ క్యాంపులో సృజనాత్మకత, చేతిరాతపై నైపుణ్యత, నైతిక విలువలు శ్లోకాలు, చిత్రలేఖనం తదితర అంశాలను విద్యార్థులకు నేర్పిస్తారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వీటిని నిర్వహిస్తారు.

జాగ్రత్తలు పాటించాలి

ఎండలు ఎక్కువగా ఉన్నందున బయట ఆడుకోవడానికి పంపించవద్దు. ఎండ తీవ్రత వలన వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. బయటకు వెళ్తామని పిల్లలు మారం చేయకుండా ఇంట్లోనే చెస్, క్యారం వంటి ఆటలు అలవాటు చేయాలి. ఇంట్లో కూడా వేడిగాలులు రాకుండా చూసుకోవాలి. అలాగే ఇంట్లో చేసిన ఆహార పదార్థాలనే తినిపించాలి. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యుడిని సంప్రదించాలి.

- డాక్టర్ సాయి, పిల్లల వైద్యులు, సిద్దిపేట

పిల్లల మెదడుకు విశ్రాంతి ఇవ్వండి



వేసవి సెలవులు అంటేనే పిల్లల చదువులకు సెలవు. పిల్లల మెదడుకు విశ్రాంతినిచ్చి ఆహ్లాదాన్ని అందించాలి. ప్రత్యేక తరగతులంటూ మానసిక ఆందోళనకు గురి చేయొద్దు. కోచింగ్, సమ్మర్ క్యాంప్‌లు అంటూ ఒత్తిడి పెంచకూడదు. వారికి ఇష్టమైన కళల్లో శిక్షణ ఇప్పించాలి. ఆధ్యాత్మిక, విజ్ఞాన ప్రాంతాలకు తీసుకెళ్లడం వలన వారిలో జనరల్ నాలెడ్జ్ పెరగడమే కాక ఆయా ప్రాంతాల పట్ల అవగాహన కలుగుతుంది. సెలవుల్లో ప్రతీ పాఠశాలల్లో ఎలాంటి తరగతులు నిర్వహించకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.

- గిర్ని అంజాగౌడ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, పాపన్నపేట పాఠశాల

ఎండ వేడిమికి రోగాలెన్నో



ఇన్ని రోజుల నుంచి పాఠశాలలో బంధీగా ఉన్న పిల్లలు ఒక్కసారిగా బయటకు వస్తారు కాబట్టి ఎండలను లెక్కచేయకుండా రెక్కలొచ్చిన పక్షుల్లా ఆడుతుంటారు. దీంతో ఎండ దెబ్బ తగిలి డీహైడ్రేషన్‌కు గురై అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది. ఇదే కాకుండా చల్లటి పానీయాలు, నాసిరకం ఐస్‌క్రీములు లాంటి తిని గొంతు ఇన్ఫెక్షన్, జ్వరం వచ్చే అవకాశాలు ఉంటాయి. వారిని ఒక కంట కనిపెట్టాలి. చెరువులు, చెట్ల దగ్గరకు వెళ్లకుండా చూసుకోవాలి.

- సూఫీ సుజాయత్ అలీ, రష్ హాస్పిటల్, మెదక్

మైనర్‌లకు వాహనాలు ఇవ్వకండి



సెలవుల్లో పిల్లలకు ద్విచక్ర వాహనాలు, కార్లపై ఎక్కువ ఆసక్తి ఉంటుంది. ఇంట్లో వాళ్లకు చెప్పకుండా వాటిని నడిపేందుకు ప్రయత్నించి రోడ్డెక్కి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. వీలైనంత వరకు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తపడాలి. ఒకవేళ మైనర్‌లు వాహనాలు నడిపితే వాహనదారుడిపైన కేసు నమోదు చేయబడుతుంది. చెరువుల వద్ద ఈత సరదాకు ప్రాణాలుపోయిన సంఘటలు చూస్తున్నాం. పెద్దలే దగ్గరుండి పిల్లలను ఈతకు తీసుకెళ్లండి.

- మురళి, సబ్ ఇన్‌స్పెక్టర్, మెదక్ రూరల్

వక్రీకరించి వైరల్ చేసిన ఆడియోపై పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తనను అప్రతిష్టపాలు చేసేందుకు ఆడియోను వక్రీకరించి వైరల్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. పేరున్న మీడియా సంస్థలు వక్రీకరించిన తప్పుడు ఆడియోను ప్రసారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గాంధీభవన్‌లో సంజీవరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తాగునీటి సమస్యపై మామిడి మహేష్ ఫోన్ చేస్తే.. జాబ్ గురించి మాట్లాడిన మరో అంశాన్ని దీనికిజోడించి ఆడియో వైరల్ చేస్తున్నారని పేర్కొన్నారు. తప్పుడు ఆడియో సృష్టించి వైరల్ చేయడం వెనుక బీఆర్ఎస్ ఉందని ఆరోపించారు. తనకు ముక్కు సూటిగా మాట్లాడం అలవాటని చెప్పారు. ఆడియో వైరల్ చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సంజీవరెడ్డి తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్, తదితరులు

జహీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రంజోల్ గ్రామంలో రైతు వేదికలో ఎరువుల దుకాణాల నిర్వాహకులు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వానాకాలానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించిన రశీదును అందజేయాలన్నారు. రైతులు కూడా ఎరువుల దుకాణాదారుల నుంచి పొందిన రశీదులను పంట కాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలన్నారు. ఆయా దుకాణాల్లో ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా మండలాల వ్యవసాయ అధికారులు ఎరువుల దుకాణాలను తనఖీలు చేసి స్టాక్ వివరాలు సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కాల్షియం కార్బైడ్‌తో పండ్లు మగ్గిస్తే చర్యలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): క్యాల్షియం కార్బైడ్‌తో పండ్లు మగ్గించి విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండ్ల వ్యాపారులందరూ కృత్రిమ పండ్లను కాకుండా సహజ సిద్ధంగా పండించిన వాటినే వినియోగదారులకు విక్రయించి ప్రజల ఆరోగ్యానికి కాపాడాలని ఆమె కోరారు.

వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ఠ


కార్యక్రమంలో తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రామాలయంలో సీతారామచంద్రస్వామి విగ్రహ పునప్రతిష్ఠ మహోత్సవం, ధ్వజస్తంభ ఏర్పాటు బుధవారం వైభవంగా నిర్వహించారు. తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి సీతారామాచంద్ర స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఉదయం నుంచే వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు చేపట్టరు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు గుజ్జరి స్వప్ననకరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోతులే శివుడి విగ్రహాన్ని పడేశాయి

- జిన్నారం ఘటనలో 10 మందిపై కేసులు
- మత విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు
- మల్టీ జోన్ 2 ఐజీ సత్యనారాయణ



జిన్నారంలో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జిన్నారం శివారులో నిర్మాణంలో ఉన్న శివాలయం ఎదుట ఉన్న మట్టి శివుడి విగ్రహాన్ని కోతులు పడేశాయని మల్టీ జోన్ 2ఐజీ వి. సత్యనారాయణ వెల్లడించారు. ఈనెల 22న రాత్రి జిన్నారం మండలంలో జరిగిన ఘటనలపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేశారని చెప్పారు. బుధవారం ఆయన సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. అక్కడి సమీపంలోని సీసీ కెమెరాలన్నీ జల్లెడ పట్టామని తెలిపారు. ఈనెల 19న సాయంత్రం 5.24 గంటలకు శివుడి విగ్రహాన్ని కోతులే పడేయడం వల్ల ధ్వంసమైనట్లు సీసీ కెమెరాల ద్వారా రుజువైందని తెలిపారు. ఈనెల 22న సాయంత్రం జిన్నారం శివారులోని మదర్సా విద్యార్థులు ఆడుకుంటూ శివాలయం వైపు వెళ్లారు. అక్కడ శివుడి విగ్రహం ధ్వంసం అయి ఉండటంతో మదర్సా విద్యార్థులే ఆ పని చేసినట్లు భావించి, వారిని ప్రశ్నించారు. పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా కొంత మంది వ్యక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి మదర్సాలో ఆస్తి నష్టం చేశారు. స్పందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ నేతృత్వంలో పోలీసులు మోహరించి పరిస్థితులను అదుపులోకి వచ్చారని, ఈ ఘటనలో అక్కడి సీసీ కెమెరాలను సమగ్రంగా పరిశీలించామన్నారు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు అక్కడ శివుడి విగ్రహం లేదన్నారు. ఆ విగ్రహం ఏమైందని పరిశీలించగా ఈనెల 19వ తేదీ సాయంత్రం 5.24 గంటలకు కొన్ని కోతులు అక్కడికి వచ్చి శివుడి విగ్రహం వద్ద కొట్లాడుకుంటూ కింద పడేశాయని, దీంతో విగ్రహం ధ్వంసమైందని తెలిపారు. వాస్తవాలను తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేసి ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగిస్తే సహించేది లేదని, అట్టి వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కేసులో పది మంది ఆందోళనకారులపై కేసులు నమోదు చేశామని ఐజీ సత్యనారాయణ తెలిపారు. సంఘటన వీడియోల ఆధారంగా ఎవరైతే ఈ ఘటనకు బాధ్యులుగా తేలుతారో వారిపై కూడా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా, పోస్టులు పెట్టినా చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.


చెక్‌పోస్టు వద్ద ఆగిపోయిన వీహెచ్‌పీ నేతలు

నిర్బంధంలో జిన్నారం

- వారం రోజులపాటు సెక్షన్ 163 అమలు
- స్థానికేతరులకు గ్రామంలోకి నో ఎంట్రీ

జిన్నారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం జిన్నారం పోలీసులు దిగ్బంధం చేశారు. స్థానిక శివాలయం వద్ద విగ్రహం ధ్వంసం అనంతరం జరిగిన ఆందోళనతో పోలీసులు అప్రమత్తమై గ్రామానికి నాలుగు వైపుల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు జిన్నారంలో 163సెక్షన్ అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ భిక్షపతి ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామంలోకి ఇతర ప్రాంతాల వారు వస్తే వారిని చెక్‌పోస్టుల వద్ద పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపించారు. స్థానికులు ఆధార్‌కార్డు చూపితేనే వారిని అనుమతించారు. దీంతో జిన్నారం, ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే వందలాది మంది తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ జిన్నారంలోనే మకాం వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వందల సంఖ్యల పోలీసు బలగాలతో చెక్‌పోస్టులు, గ్రామంలో పహారా జరిపారు. వీహెచ్‌పీ, బీజేపీలకు చెందిన జిల్లా, రాష్ట్ర నాయకులు జిన్నారంలోకి రావడానికి ప్రయత్నించగా.. చెక్‌పోస్టుల వద్ద అడ్డుకున్న పోలీసులు వారిని వెనక్కి పంపించారు. దీంతో మండల కేంద్రం నిర్మానుష్యంగా మారింది. శివాలయ దర్శనానికి వెళుతన్న ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఐదు రోజులపాటు కోహీర్ రైల్వే గేటు మూసివేత


కోహీర్ సమీపంలోని రైల్వే గేట్

కోహీర్, ఏప్రిల్ 23: (ఆంధ్రజ్యోతి): కోహీర్ - పోతిరెడ్డిపల్లి మార్గమధ్యలో కోహీర్ సమీపంలోని 23వ నంబర్ రైల్వే గేటును ఐదు రోజుల పాటు మూసివేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. 25వ తేదీ నుంచి 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఈ రైల్వే గేటును అత్యవసర మరమ్మతుల కోసం మూసివేయడం జరుగుతుందన్నారు. అందుకు ప్రయాణికులు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని వెళ్లాలని కోరారు.

ఉపాధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

కొడిపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేసిన పనుల్లో నాణ్యత తప్పనిసరి అని మెదక్, సిద్దిపేట జిల్లాల క్వాలిటీ కంట్రోల్ అధికారి జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీలో నిర్మాణం చేసిన పశువుల పాకను, రోడ్డు పనులు, ఉపాధి కూలీల పనుల వద్దకెళ్లి మాట్లాడారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి కూలీకి రూ.300 వచ్చేవిధంగా కొలతలు ఇస్తూ పనిచేయించాలని సూచించారు.

కు.ని.తో కుక్కల సమస్యకు చెక్

- జిల్లా కేంద్రంలో అందుబాటులోకి వచ్చిన ఏబీసీ
- మూడు నెలలుగా వెయ్యికి పైగా ఆపరేషన్లు
- ఒక్కో ఆపరేషన్‌కు రూ.1650 చెల్లిస్తున్న మున్సిపాలిటీ
- శునకాల పెరుగుదలకు అడ్డుకట్ట


శస్త్ర చికిత్సలు చేస్తున్న వైద్యులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుక్కల సంతతి పెరగకుండా ఉండేందుకు జిల్లా కేంద్రంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా కేంద్రంతోపాటు నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీల పరిధిలోని వీధి శునకాలకు ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయనున్నారు. దుబ్బతోట శివారు ఎకరా స్థలంలో రూ. 84 లక్షలతో ఏబీసీ కేంద్రానికి భవనం ఏర్పాటు చేశారు. ఇందులో 18 కెనల్స్‌తో పాటు 20 బోన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుందుకు ఆపరేషన్ థియేటర్‌లో అన్ని వసతులను ఏర్పాటు చేశారు. ఒక డాక్టర్, ఒక అసిస్టెంట్, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు. రోజూ ఒక ఆటోలో వెళ్లి వార్డుల వారీగా 20కి పైగా కుక్కలను పట్టి తీసుకెళ్తున్నారు. తెచ్చిన వాటిని బోన్‌లో ఒక రోజు ఉంచి పర్యవేక్షిస్తారు. ఆరోగ్య పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఆపరేషన్‌కు తీసుకెళ్తారు. అనంతరం పోస్ట్ ఆపరేటివ్‌లో భాగంగా బోన్లలో ఉంచి తిరిగి పర్యవేక్షిస్తారు. శునకానికి కుట్లుమాని సాధారణ స్థితికి వచ్చాక ఎక్కడి నుండి పట్టుకొచ్చారో అక్కడే వదిలేస్తారు. పట్టినప్పటినుండి వాటిని వదిలేసేంత వరకు ఆపరేషన్‌తో కలిసి ఒక్క కుక్కకు రూ.1,650ను మున్సిపాలిటీ సదరు నవోదయ స్వచ్ఛంద సంస్థకు చెల్లిస్తుంది. కుక్కలతో పాటు పశువులకు కూడా ఇక్కడే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. గేదెలు, ఆవులే కాకుండా పట్టణంలో ఇష్టానుసారంగా సంచరించే ఇతర జంతువులకు కూడా ఆపరేషన్ చేసే సదుపాయాన్ని కల్పించారు. త్వరలో ఈ పశువుల కేంద్రం సైతం అందుబాటులోకి రానుంది. పట్టణాల్లోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల నుంచి కుక్కలను తెచ్చి ఆపరేషన్ చేసే అవకాశం ఉంది. గ్రామాలలోని కుక్కలకు ఆపరేషన్లు చేస్తే పంచాయతీ వారే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

శునకాల జనన నియంత్రణ కోసం..

సాధారణంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ చేసేకంటే ముందు ఉండే కోపం చికిత్స అనంతరం తగ్గుతుంది. దీంతో మనుషులపై దాడిచేసే గుణాలు తగ్గుముఖం పడతాయి. ఈ చికిత్స ద్వారా కుక్కలను చంపకుండా వాటి జనన నియంత్రణను తగ్గించవచ్చు. జిల్లా వ్యాప్తంగా వంద శాతం ఆపరేషన్లు పూర్తి చేస్తే ఎక్కడికక్కడ కుక్కల పెరుగుదలకు అడ్డుకట్ట వేసినట్లవుతుంది.

కుక్కల సంతతి పెరగకుండా చర్యలు...

కుక్కల సంతతి పెరగకుండా ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఉపయోగపడుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి మాసంలో ఏబీసీని ప్రారంభించామని, ఇప్పటి వరకు 1000కి పైగా కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసినట్లు చెప్పారు. ఈ విధానంతో వాటి సంతానం పెరగకుండా నియంత్రించవచ్చని వివరించారు. త్వరలోనే అన్ని ప్రాంతాల శునకాలకూ శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు.



పశవుల కోసం నిర్మించిన కేంద్రం


ఆపరేషన్‌కు ముందు కెనల్స్‌లో ఉంచిన కుక్కలు


వీధుల్లో ఉన్న కుక్కలను పట్టుకొస్తున్న సిబ్బంది

న్యూస్ బాక్స్

సమ్మెతో మోదీకి గుణపాఠం చెబుదాం

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మే 20న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం వేలాదిగా పాల్గొని మోదీకి గుణపాఠం చెబుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యదర్శి జయరాజ్, నాయకులు శ్రీకాంత్, రాజు, నవీన్, గోపాల్, మల్లేశం, లక్ష్మణ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

హజ్‌యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని రావాలి

జహీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంతం నుంచి హజ్‌యాత్రకు వెళ్తున్న ముస్లింలు దేవుడి ఆశీస్సులతో యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని రావాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్దం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. జహీరాబాద్ నుంచి హజ్‌యాత్రకు వెళ్తున్న వారిని రంజోల్‌లో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబీజ్, నాయకులు జమీలొద్దీన్, అక్బర్, హర్షద్‌పాటిల్, ఇమామ్‌పాటిల్, భర్కత్, తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్లలో మైనింగ్ శాఖ అధికారుల తనిఖీలు


స్టోన్ క్రషర్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న మైనింగ్ అధికారులు

జిన్నారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మాధారం పరిధిలోని స్టోన్ క్రషర్ల భూ ఆక్రమణలు, అనుమతి లేని నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేశారు. బుధవారం మైనింగ్‌శాఖ ఆర్ఐ సైదులు ఆధ్వర్యంలో అధికారులు స్టోన్ క్రషర్ల ప్రాంతంలో పర్యటించారు. ఆయా క్రషర్లకు కేటాయించిన భూ విస్తీర్ణం, అనుమతులు పరిశీలించారు. ఆరోపణలు ఉన్న వాటికి నోటీసులు జారీచేస్తామని అధికారులు తెలిపినట్లు మాధారం గ్రామ పోరాట కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం జిల్లా అధికారి రేణుక, న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు కరుణాకర్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని చట్టాలపై ప్రజలకు షీటీమ్, న్యాయ విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో షీటీమ్ అధికారి గంగమణి, వెంకటేశ్వర్లు, రమేష్, న్యాయవాది ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

పుల్కల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేటలో బుధవారం 3వ రోజు తుల్జాభవానీమాత జాతర జరిగింది. ఉత్సవాల్లో భాగంగా వేదబ్రాహ్మణులు కుంకుమార్చన, ఆకుపూజ, పుష్పార్చన, హోమం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కళాకారులు ఎల్లమ్మదేవి వీధి నాటకం ప్రదర్శించారు.

ఫేస్‌బుక్‌లో పోస్టుపెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి విషయంలో కేంద్ర వ్యవస్థ, నిఘావ్యవస్థ వైఫల్యమే కారణమంటూ అహ్మద్ అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టాడు. అతనిపై చర్యలు తీసుకోవాలని బుధవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేంద్ర వ్యవస్థ, నిఘా వ్యవస్థలను కించపరుస్తూ.. ఫేస్‌బుక్‌లో పోస్టుపెట్టి మతాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పెళ్లిలో గాలి బీభత్సం

మనూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మనూరు మండలం రాణాపూర్‌లో బుధవారం గాలి బీభత్సవం సృష్టించింది. గ్రామానికి చెందిన మాలిపటేల్ సిద్దిరాం కుమారుడి వివాహం జరిగింది. ఈ వివాహమైన కొద్దిసేపటికి పది నిమిషాల పాటు గాలి బీభత్సం సృష్టించింది. దీంతో టెంట్‌లోని కట్టెలు ఎగిరిపడి ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమయంలోనే మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి వివాహానికి హాజరయ్యారు.

భూభారతి చట్టం... రైతులకు చుట్టం

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
● పలు మండలాల్లో 'భూభారతి'పై అవగాహన సదస్సు


కంది రైతువేదిక వద్ద భూభారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి


చిన్నశంకరంపేట రైతువేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డీవో రమాదేవి

కంది/పుల్కల్/మునిపల్లి/కోహీర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ధరణికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం... రైతులకు చుట్టం అని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మండల కేంద్రమైన కందిలోని రైతువేదిక వద్ద బుధవారం నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. భూభారతి పోర్టల్ ద్వారా భూ సమస్యలు సత్వర పరిష్కారం అవుతాయన్నారు. అత్యాధునిక సాంకేతికత గల భూ భారతి పోర్టల్ ఎంతో సులభతరంగా ఉంటుందని తెలిపారు. రైతులకు ఇచ్చే పాసు పుస్తకాలతో వారి భూమికి సంబంధించిన చిత్రపటం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ జిల్లా అధికారి శివప్రసాద్, తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ కిరణ్, ఆర్ఐ రంగయ్య, ఎంపీవో మహేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో భూభారతి చట్టంపై కలెక్టర్ వల్లూరి క్రాంతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పాండు, తహసీల్దార్ అనుదీప్, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్, నాయకులు పాల్గొన్నారు. మునిపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన భూభారతి అవగాహనా సదస్సుకు కలెక్టర్ వల్లూరి క్రాంతి హాజరై మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ గంగాభవాని, ఎంపీడీవో హరినందన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తమ గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని రైతులు, ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

'భూభారతి'తో సమస్యలు పరిష్కారం

చిన్నశంకరంపేట/చేగుంట/మాసాయిపేట/ ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టంతో రైతుల భూసమస్యలు పరిష్కారమవుతాయని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండలంలోని రైతువేదికలో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, ఏడీఏ విజయనిర్మల, తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్, రైతులు పాల్గొన్నారు. చేగుంట మండలంలోని రైతువేదికలో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భూభారతి అవగాహనా సదస్సుకు కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరై మాట్లాడారు. ధరణికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం భూభారతి చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి హైమావతి, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. మాసాయిపేట మండల కేంద్రంలోని రైతువేదికలో భూభారతి చట్టంపై కలెక్టర్ రాహుల్‌రాజ్ రైతులకు అవగాహన కల్పించారు.

కేసీఆర్ చిత్రాన్ని తొలగించాలి

కంది, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కందిలోని రైతువేదిక వద్ద బుధవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వచ్చిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోతీలాల్, నాయకులు బూడిదకుమార్, మల్లెపల్లి శ్రీనివాస్ రైతువేదిక మీద కేసీఆర్ చిత్రాన్ని చూసి ఆగ్రహానికి లోనయ్యారు. కేసీఆర్ చిత్రాన్ని తొలగించాలని ఏవో శ్రీనివాస్‌పై మండిపడ్డారు. జిల్లాలో అన్ని రైతువేదికల వద్ద కేసీఆర్ చిత్రాపటాలను తొలగించామని, ఇక్కడ కూడా తొలగిస్తామని తెలపడంతో వారు శాంతించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి


శెల్గిరలోని పాఠశాలలో బడిబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మనూరు మండల పరిధిలోని శెల్గిర పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుమూల ప్రాంతంలోని పాఠశాలలో ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించినందుకు ప్రధానోపాధ్యాయుడు రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ పాఠశాలలో 60 మంది ఉన్న విద్యార్థుల సంఖ్యను 95కు పెంచడం సంతోషకరమన్నారు. అనంతరం బడిబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజశేఖర్, మాజీ జడ్పీటీసీ నిరంజన్, మాజీ ఎంపీటీసీ పురంజన్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు బి.నాగమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభలో ఉద్యమ కార్యాచరణ

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభలో నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం, టీఎన్‌జీవోస్ మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు


సమస్యలు తెలుపుతున్న వినియోగదారులు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కస్టమర్ సర్వీస్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని బీఎస్ఎన్ఎల్ డీజీఎం శివరాం ప్రసాద్ తెలిపారు. సంగారెడ్డిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కస్టమర్ సర్వీస్ క్యాంపులో ఆయన మాట్లాడారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మొబైల్ రిలేటెడ్ సమస్యలు, బిల్లుల సమస్యలు ఇతరత్రా సమస్యలపై ఫిర్యాదులు అందాయని, వాటిని పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు బాలాజీ, జగన్, ఎస్‌డీఈ లక్ష్మీనారాయణ, జేటీవోపీ శ్రీనివాస్, సంతోష్, సుబ్బమ్మ, ఝాన్సీరాణి, ఏవో రాజు, యాదయ్య పాల్గొన్నారు.

సరిహద్దు భూవివాదాలతో నిలిచిన అభివృద్ధి


భెల్ ఈడీ భరణిరాజాకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సరిహద్దు భూముల వివాదాలతో పెద్దఎత్తున జరగాల్సిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం బీహెచ్‌ఈఎల్ పరిశ్రమ ఈడీ భరణిరాజాతో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్‌తో కలిసి ఎమ్మెల్యే సమావేశమై మాట్లాడారు. దశాబ్దాలకాలంగా భెల్ సరిహద్దుల్లో స్థానికులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. బీరప్ప ఆలయం, మసీదు, పశువుల కొట్టాలు నేరుగా తొలగించారని వివరించారు. దీనివల్ల మానవ సంబంధాలు దెబ్బతింటాయని చెప్పారు. అలానే జాతీయ రహదారికి తలమానికంగా మారాల్సిన రాయసముద్రం చెరువు అభివృద్ధి విషయంలో పూర్తిగా భెల్ అధికారులవల్లే నిలిచిపోయిందని కార్పొరేటర్ పుష్పానగేష్ చెప్పారు. పారిశ్రామికవాడల్లో మరో ట్యాంక్‌బండ్‌ను నిర్మించడానికి ఎమ్మెల్యే సంకల్పించారని తెలిపారు. ఇందుకు రూ.20 కోట్లు అంచనా వ్యయం అవుతుందని లెక్కలు వేశామని చెప్పారు. చెరువుకు ఆనుకొని ఉన్న అన్ని కాలనీలతో కలిసేటట్టు లింకు రోడ్ల నిర్మాణాలు చేపట్టడానికి సంకల్పించామని అన్నారు. ఇందుకు భెల్ సరిహద్దు అడ్డుగా మారాయన్నారు.

ఇంటర్ ఫలితాల్లో కళాశాలల ప్రతిభ


సెమంతిక, మధులత, భార్గవి, వైష్ణవి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో సంగారెడ్డిలోని ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో సెమంతిక (463/470), బైపీసీ విభాగంలో మధులత 420/440, సీఈసీ విభాగంలో సీ.హెచ్.రుచిత 468/500, ఎంఈసీ విభాగంలో వరుణ్‌చారి 443/500 మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో భార్గవి (992/1000), శ్వేత 988, బైపీసీ విభాగంలో వైష్ణవి (989/1000), మణికీర్తి 987, సీఈసీ విభాగంలో సంగీత (950/1000), ఎంఈసీ విభాగంలో మధులిక (909/1000) మార్కులు సాధించారు. ఒకేషనల్ జూనియర్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో పుష్పలత (461/500) మార్కులు, ఎంఎల్‌టీ విభాగంలో లక్ష్మణ్ 452/500 మార్కులు సాధించారు. వీరిని కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, అధ్యాపక బృందం సభ్యులు అభినందించారు.


అత్యుత్తమ ఫలితాలు సాధించిన శ్రీఅక్షయ జూనియర్ కళాశాల విద్యార్థులు

అంబేడ్కర్ వొకేషనల్ విద్యార్థుల విజయఢంకా


సంగారెడ్డిలోని అంబేద్కర్ ఒకేషనల్ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ థారాసింగ్, ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

ఇంటర్ ఫలితాల్లో సంగారెడ్డిలోని డా.బీ.ఆర్. అంబేడ్కర్ వొకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. ఫస్టియర్ ఎంఎల్‌టీ విభాగంలో ప్రవళిక 490/500, మౌనిక 486 మార్కులు సాధించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూలో రుషిక 477/500 మార్కులు, వర్షిణి 467 మార్కులు సాధించారు. సెకండియర్ ఎంఎల్‌టీ విభాగంలో శ్రీజ 958/1000, స్రమీన్ 953 మార్కులు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో సంగీత 947/1000, మహేశ్వరి 923/1000 మార్కులు సాధించారు. పీటీ ఫస్టియర్‌లో శివాని 453/500 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ భార్గవిదారా సింగ్ అభినందించారు.

ఇస్లామిక్ తీవ్రవాదాన్ని నశింపజేయాలి

తీవ్రవాదాన్ని పూర్తిగా నశింపజేయాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. కశ్మీర్‌లో హిందువులపై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం జహీరాబాద్ పట్టణంలో బీజేపీ, హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. సంగారెడ్డి, మెదక్ పట్టణంలో, నర్సాపూర్, శివ్వంపేట, వెల్దుర్తి, మనోహరాబాద్ మండలాల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్


జహీరాబాద్‌లో హిందూసంఘాల ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం


సంగారెడ్డి క్రైం :బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల నిరసన


శివ్వంపేటలో కొవ్వొత్తులతో ర్యాలీ


వెల్దుర్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నిప్పుల కొలిమి

5వ పేజీ తరువాయి

పాతూరు 42.5, శంకరంపేట 42.5, నాగపూర్ 42.5, మాసాయిపేట 42.4, వాడి 42.4, కౌడిపల్లి 42.4, నర్సాపూర్ 42.3, సర్దన 42.3, బుజ్జారంపేట 42.3, దామరంచ 42.2, నర్లాపూర్ 42.2, శివ్వంపేట 42.1, వెల్దుర్తి 42.1, రామయంపేట 42.1, కాగజ్‌మద్దూర్ 42, రేగోడు 41.9, చేగుంట 41.8, మెదక్ 41.8, మిన్పూర్ 41.7, చిప్పల్తుర్తి 41.6, అల్లదుర్గం 41.5, లక్ష్మాపూర్ 41.5, రాజ్‌పల్లి 41.5, లింగాయపల్లి 41.3, దొంగల ధర్మారం 41.1, టేక్మాల్ 41.1, మొయినాబాద్ 41, బోడగట్ 41.0, ఇస్లాంపూర్ 40.9, శివనూర్ 40.7 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంగారెడ్డి జిల్లా కడ్పల్‌లో 42.6, వట్‌పల్లి 42.5, నిజాంపేట 42.5, పుల్కల్ 42.4, సిర్గాపూర్ 42.3, మల్‌చేల్మ 42.3, పాల్వట్ల 42.2, కల్హేర్ 42.2, దిగ్వాల్ 42.1, లక్ష్మీసాగర్ 42.1, జిన్నారం 42, నారాయణఖేడ్ 42, చౌటకూర్ 42, సత్వర్ 42 అల్మాయిపేట్ 41.9, సుల్తాన్‌పూర్ 41.9, ఆల్గోల్ 41.9, నల్లవల్లి 41.8, గుమ్మడిదల 41.7, పాశమైలారం 41.7, అన్నాసాగర్ 41.6, పటాన్‌చెరు 41.5, కంగ్టి 41.5, రామచంద్రాపురం 41.5, సదాశివపేట 41.4, కిష్టారెడ్డిపేట 41.4, మొగుడంపల్లి 41.3, గుండ్లమాచనూరు 41.3, కంది 41.1, న్యాల్‌కల్ 41.1, ముక్తాపూర్ 40.8, బీహెచ్‌ఈ ఎల్ 40.8, కొండాపూర్ 40.8, జహీరాబాద్ 40.7, ఝరాసంఘం 40.7, నాగల్‌గిద్ద 40.7, మనూర్ 40.6, రాయికోడు 40.3, రుద్రారం 40, హత్నూర 40.2, సంగారెడ్డి 40.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

బహుళ అంతస్తుల నిర్మాణం గొడవలకు ఆజ్యం

● పోలీస్‌స్టేషన్‌కు చేరిన గొడవ ● టౌన్‌ప్లానింగ్ శాఖ విచారణ

రామచంద్రాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలంలోని తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ఉస్మాన్‌నగర్‌లో బీమాక్ సొసైటీ కాలనీ(బీహెచ్‌ఈఎల్ కార్మికుల కాలనీలో) మంగళవారం రాత్రి జరిగిన గొడవ పోలీస్‌స్టేషన్ వరకు చేరింది. కొన్నేళ్ల క్రితం తెల్లాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి బీహెచ్‌ఈఎల్ కార్మికుల గృహ సముదాయాలను నిర్మిస్తున్న ఎస్ఎస్‌పీడీఎల్ సంస్థ నుంచి 1200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. సదరు వ్యక్తి గృహ నిర్మాణాలు పూర్తయ్యాక తన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణానికి ఆది నుంచి బీహెచ్‌ఈఎల్ సొసైటీ సభ్యులు అడ్డు చెబుతూనే వస్తున్నారు. కానీ సదరు నిర్మాణదారుడు ఇంటి నిర్మాణాన్ని కొనసాగిస్తూ వస్తున్నాడు. మంచినీరు ఇక్కడున్న ఇళ్లకే సరిపోవడం లేదని, డ్రైనేజీ వ్యవస్థను కూడా సరిపడా ఇళ్ల మట్టుకే ఎస్‌టీపీ నిర్మించామంటూ సొసైటీ సభ్యులు చెప్పారు. పైగా ఇది గేటెడ్ కమ్యూనిటీ అని ఎక్కువ అంతస్తులు నిర్మించడానికి వీలు లేదని బిల్డర్‌కు చెప్పారు. అయితే బిల్డర్ తన నిర్మాణం నుంచి వచ్చే డ్రైనేజీని మంగళవారం కాలనీ డ్రైనేజీలో కలిపేందుకు యత్నించాడు. ఈ క్రమంలో రోడ్డు ధ్వంసం అవ్వడంతో పాటు మంచినీటి పైపు పగిలింది. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఆగ్రహించిన బిల్డర్ కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సొసైటీ సభ్యులు కూడా బిల్డర్‌పై ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారుల వద్ద సమస్యను పరిష్కరించుకోవాలని సీఐ రవీందర్ వారిని పంపించారు. ఇదిలా ఉండగా మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం ఉదయం వచ్చి, నిర్మాణాన్ని తనిఖీ చేసి వెళ్లారు. నిర్మాణ అనుమతుల విషయమై నిర్మాణదారులు స్పష్టత ఇవ్వడం లేదు.

పర్యావరణాన్ని కాపాడుదాం : జడ్పీ సీఈవో

కంది, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పచ్చదనం పెంచుదాం... పర్యావరణాన్ని కాపాడుదామని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా హితవు పలికారు. కంది మండలంలోని కవలంపేటలో బుధవారం ఆయన పర్యటించారు. పంచాయతీ నర్సరీలో మొక్కలు పచ్చగా ఉన్నాయని, వేసవిలో మొక్కలను జాగ్రత్తగా రక్షించుకోవాలని సూచించారు. అనంతరం డంపింగ్‌యార్డు, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో సమస్యలు లేకుండా అంకితభావంతో పనిచేస్తున్నందుకు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను అభినందించారు. ఆయన వెంట డీఎల్పీవో అనిత, ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దు

హత్నూర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి అన్నారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్, చింతల్‌చెర్వు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. అక్కడ పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సరైన వైద్య సేవలందించాలని సూచించారు. ఐదేళ్ల వయసు ఉన్న పిల్లలందరికీ టీకా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆమె వెంట డాక్టర్లు రమారమణి, రాధిక ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి


జహీరాబాద్: శ్రీకృష్ణవేణి పాఠశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

హవేళిఘణపూర్/పాపన్నపేట/మునిపల్లి/జహీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని మెదక్ జిల్లా క్రైం బ్రాంచ్ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. బుధవారం మండలంలోని కూచన్‌పల్లి ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మధుమోహన్, ఉపాధ్యాయులు మల్లారెడ్డి, శివరాజ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పాపన్నపేట మండల పరిధి కుర్తివాడ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. మునిపల్లి మండలంలోని ప్రైమరీ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఎంఈవో భీంసింగ్ హాజరై మాట్లాడారు. జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్‌లోగల శ్రీకృష్ణవేణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. పాఠశాలల చైర్మన్ వెదిరే ఆశోక్‌రెడ్డి హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

పుల్కల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఛత్తీస్‌ఘడ్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల తరహాలో దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఎన్‌పీఆర్‌డీ జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన పుల్కల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కల్పించడం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు.

హోమియోపతి, యోగాపై అవగాహన


హోమియోపతి మందులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు డా.నర్మద

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఇంద్రకాలనీలో హోమియోపతి విభాగం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోషణ పక్వాడలో భాగంగా పట్టణంలోని రాజంపేట, రిక్షాకాలనీ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులకు హోమియోపతి మందుల వల్ల ఉపయోగాలు, పోషకాహారం, యోగా, ఆరోగ్యం, లైఫ్ స్టైల్ తదితర అంశాలపై హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.నర్మదషిండే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఎన్.రమేశ్, యోగా ట్రైనర్లు అజయ్ పాల్గొన్నారు.